క్లుప్తంగా

ఏఎంసీ చైర్మన్ బాధ్యతల స్వీకారం



రాజుపాలెం: రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కొండ్రెడ్డి సుజాత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. యార్డు కార్యదర్శి ఆంజనేయసింగ్ సాదరంగా ఆహ్వానించి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, గణపవరం సర్పంచ్ గన్నుపల్లి వెంకటరమణ బుల్లిబాబు, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ పశ్యావుల కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండ్రెడ్డి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదలలో ఫ్యామిలీ ఫిజిషియన్

మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, ఎన్.సూర్యప్రకాశరావు పాల్గొని 114 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త, షుగర్ పరీక్షలు చేశారు. మందులను అందించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, శాంత కుమారి, సూపర్‌వైజర్లు పీటర్ డానియేస్, జోస్పిన్‌రాణి, ఏఎస్ఎం అన్నామణి, రామమ్మ, మార్తమ్మ, నీరజ, డీఈఓ రవితేజ పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మాదల(ముప్పాళ్ళ): అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మాదలలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మాదల బీసీ కాలనీకి చెందిన గోగుల అంజయ్య(40) సాగు కోసం సుమారు రూ.13 లక్షలకుపైగా అప్పులు చేశాడు. అప్పుల వాళ్ల ఒత్తిడి చేయడంతో ఏం చేయాలో పాలుపోక గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభి రామయ్య తెలిపారు.

టీడీపీ నాయకునికి పింఛన్



రాజుపాలెం: అనుపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు గోగుల అంజియ్య అనారోగ్యంతో గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గ్రామ వలంటీర్ దొడ్డా శివరాంబ్రహ్మారెడ్డి గుంటూరు వెళ్లి వైద్యశాలలో చికిత్స పొందుతున్న అంజియ్యకు వృద్ధాప్య పింఛన్ రూ.2,750ను శుక్రవారం అందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సామాజిక పింఛన్లను అందిస్తున్నారనడానికి ఈ ఉదంతమే నిదర్శనం.

నీటికుంటల ఆవశ్యకతను రైతులు గుర్తించాలి

బొల్లాపల్లి : భూగర్భజలాల వృద్ధికి నీటికుంటలు ఎంతో ఉపయోగకరమని ఉపాధి హామీ ఏపీఓ జీఎస్ ఆంజనేయరాజు తెలిపారు. మండలంలో అధికంగా మెట్ట ప్రాంతం ఉన్న సాగునీరు ఇబ్బందులు తొలగాలంటే పొలాల్లో బోర్ల సమీపంలో రైతులు నీటికుంటల ఆవశ్యకతను గుర్తించాలని చెప్పారు. వీటి వలన భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని సాగునీటికి ఇబ్బందులు ఉండవని అన్నారు. చిన్న, సన్నకారు రైతులను నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఐదు ఎకరాలలోపు రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.50 వేలు నుంచి రూ. 1.50 లక్షల వరకు ఉచితంగా అందజేస్తుందన్నారు. రైతులు తమ పొలాల్లో 2 మీటర్ల లోతు, 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో లేదా 20 మీటర్ల వెడల్పు, 20 మీటర్ల పొడవుతో నీటి కుంటలు ఏర్పాటు చేసుకునే ఆవశ్యకతను ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం కల్పిస్తుందని రైతులు సద్వినియోపరచుకోవాలని ఏపీవో తెలిపారు.

రైతు సదస్సులు వినియోగించుకోవాలి

మాచర్ల రూరల్: రైతుల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, సద్వినియోగపరుచుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ వాణి కోరారు. శుక్రవారం మండలంలోని కంభంపాడు, రాయవరం గ్రామాలలో జరిగిన రైతు సదస్సుల్లో ఆమె మాట్లాడారు. ఆన్ రిజిస్టర్, తెల్ల కాగితంపై కొనుగోలు చేసిన పట్టా భూములకు సంబంధించి సాదా బైనామా కింద క్రమబద్ధీకరించి ప్రభుత్వం నుంచి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు వివరించారు. భూ యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఆరుముళ్ళ నాగేశ్వరరావు, కె.అనిల్ కుమార్, మహమ్మద్ హసన్, పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి పన్నులే ఆధారం

- వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- ముంచుకొస్తున్న ముగింపు గడువు
- డిమాండ్ రూ.7.45 కోట్లు
- వసూలు రూ.4.34 కోట్లు
- ఆస్తి పన్ను వసూలులో ముందంజ
- సచివాలయాలవారీగా 15 బృందాలు ఏర్పాటు



సత్తెనపల్లి పట్టణం

సత్తెనపల్లి: స్థానిక సంస్థలకు పన్నులు, శిస్తుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. పట్టణాభివృద్ధికి ఈ నిధులు సమకూర్చుకోవడం అవసరం. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రుపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా.. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఖజానాను నింపుకోవటం కీలకమనే చెప్పాలి. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమని అధికారులు పేర్కొంటున్నారు. కొన్నేళ్లుగా సత్తెనపల్లి పురపాలక సంఘంలో పన్నులు, శిస్తుల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో 2023–24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

మొండి బకాయిలపై శ్రద్ధ

పురపాలక సంఘంలో వివిధ పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం అధికారిక లెక్కల ప్రకారం రూ.7.45 కోట్లుగా ఉంది. ఇప్పటివరకు రూ.4.34 కోట్లు వసూలు కాగా ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా మరో రూ.3.01 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అధిక శాతం మొండిబకాయిలు కావడం గమనార్హం. ఏళ్ల తరబడి సకాలంలో పన్నులు చెల్లించని వారే జాబితాలో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. వీరి నుంచి వసూళ్లకు ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు పేర్కొంటున్నారు. అవసరమైతే వారిపై మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అన్ని రకాల పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయంలో ఆస్తి పన్ను ఆశించిన స్థాయిలో వసూలు జరుగుతుండగా ఖాళీ స్థలాలు, నీటి పన్నుల వసూలు తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

సత్తెనపల్లి పట్టణంలో పన్నుల వివరాలు ఇలా..

పన్ను రకం	అసెస్ మెంట్లు	డిమాండ్	వసూలు	బకాయి
		(రూ.కోట్లలో)		
ఆస్తి	15,525	5.57	3.60	1.97
నీటి	8,980	1.39	0.54	0.85
ఖాళీస్థలం	785	39.22	20.16	0.19
మొత్తం	25,290	7.45	4.34	3.01

గతం కంటే మెరుగే..

గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది పన్నుల వసూలు మెరుగ్గానే ఉంది. మొండి బకాయిదారుల వల్లే సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో వసూళ్ల కోసం సచివాలయాల వారీగా 15 ప్రత్యేక బృందాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆస్తి పన్ను వసూలుకు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, అడ్మిన్ అసిస్టెంట్‌తోపాటు మున్సిపల్ ఉద్యోగిని గ్రూప్‌గా ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాల పన్నుల వసూలుకు టౌన్ ప్లానింగ్ సెక్రటరీలను, నీటి పన్ను వసూలుకు ఎమినిటీస్ సెక్రటరీలను వినియోగిస్తున్నారు.

గెలు'పది'గో.. అందుకోండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఫణిభూషణ్ తదితరులు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

- ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం మీదే
- పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

అమరావతి: పదో తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో తొలి మెట్టు అని, టెన్త్ ఉత్తీర్ణులైతే ఉన్నత చదువులకు మార్గం సుగమమవుతుందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఫణిభూషణ్ చెప్పారు. శుక్రవారం స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఫణిభూషణ్ మాట్లాడారు. కార్యక్రమానికి ఎంఈఓ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ ఫణిభూషణ్ మాట్లాడుతూ గెలుపు ముంగిటే ఉంటుందని, మనమే అందుకోవాలని చెప్పారు. విద్యార్థులు చదువుపైనే శ్రద్ధపెట్టాలని సూచించారు. అనవసరమైన వాటికి దూరంగా ఉండాలని, ఒత్తిడి జయించి ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. పరీక్షల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల సమస్యలను చిట్టీల రూపంలో తెలుసుకుని సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీసునీతరాణితోపాటుగా పలు పాఠశాలల హెచ్ఎంలు, పలు పాఠశాలల టెన్త్ విద్యార్థులు 800 మంది పాల్గొన్నారు.

వైభవం.. ప్రతిష్టా మహోత్సవం



రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుడితో పాటు ధ్వజస్తంభం, నవగ్రహ మండపం, విమాన శిఖర ప్రతిష్టా కార్యక్రమాన్ని ఆకళంకం వెంకట రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుస్మితారెడ్డి దంపతులు ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి వరసిద్ధి వినాయకుని దర్శించుకున్నారు. పూర్ణాహుతి నిర్వహించారు. –నరసరావుపేట రూరల్

బైక్ చక్రాలు మాయం...!

బైక్ చోరీలు జరగడం సర్వ సాధారణం. కానీ ఇంటి ముందు ఉంచిన రెండు బైక్‌ల చక్రాలను గుర్తు తెలియని దుండగులు ఊడదీసుకెళ్లిన ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. ఎస్‌బీఐ సమీపంలో నివసించే పోపూరి రాము గురువారం రాత్రి తన ఇంటిముందు బైక్‌ను ఉంచి శుక్రవారం ఉదయం లేచి చూడగా వెనక చక్రం కనిపించలేదు. అదేరోజు రాత్రి గ్రామంలోని హైవే సర్వీసు మార్గంలోని బైక్ మెకానిక్ షేక్ కరిముల్లా రిపేరుకు వచ్చిన బైక్‌లకు ఐరన్ చైన్‌తో చుట్టి తాళం షెడ్డుమూసి ఇంటికెళ్లాడు. ఉదయం వచ్చి చూస్తే బయట ఉంచిన వాహనాల గొలుసు ఊడదీసి ఉంది. ఓ బైక్ వెనుక చక్రం కనిపించలేదు. దీంతో వీరిద్దరూ పోలీసులను ఆశ్రయించారు. –యడ్లపాడు



బెస్ట్ ఆఫ్ లక్!



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయినీ సింగంశెట్టి అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ ఒంగూరి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులందరూ బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. 130 మంది విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో గంగినేని వీరయ్య, టి.వెంకట నర్సయ్య, పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు గంగినేని రాఘువ, గోవిందయ్య, కుమార్, రమేష్, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, సీహెచ్. సుభాష్, కిరణ్, నాయక్ తదితరులు పాల్గొన్నారు. – వినుకొండ(నూజెండ్ల)

ఆల్ ఆర్ హ్యాపీ....

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థత గురైన విద్యార్థుల ఆరోగ్యం క్షేమంగా ఉందని రాష్ట్రీయ బాల సురక్ష యోజన అధికారి హనుమా కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అస్వస్థత గురైన 15 మంది విద్యార్థులకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మరో నలుగురు విద్యార్థులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. తల్లిదండ్రులు ఆందోళన పడాల్సిన పనిలేదని, అందరు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు. –శావల్యాపురం



ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు: మండలంలోని కొత్తసొలస గ్రామంలో షిర్డీ సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కిలారు కుప్పుస్వామి, గ్రామస్తుల సహకారంతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం లక్ష్మణాచార్యులు, రుత్వికులు పరుచూరి రామకృష్ణమాచార్యులు, బి. పార్థసారథి ఆధ్వర్యంలో బాబావారికి కాగడాహారతి, విశ్వక్సేన పుణ్యాహవచనం, వినాయక, దత్తాత్రేయ సమేత సాయిబాబా వారికి పంచామృత అభిషేకాలు, పట్టువస్త్రాలు, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక వేడుకలకు హాజరైన భక్తులకు అన్నదానం, పలు రకాల ప్రసాదాల పంపిణీ చేశారు. సాయంత్రం సంధ్యాహారతి, భజన సంకీర్తనలు ఏకహారతి, కుంభహారతులు కోలాహలంగా జరిగాయి. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సమీప ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వేదపాఠశాల ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ వేద పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు పోలూరి కృష్ణవాసుకీ శ్రీకాంతశర్మ తిరుపతి జాతీయ సంస్కృత విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. తిరుపతి విద్యాపీఠంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎస్.వేణుగోపాల్‌స్వామి నుంచి పట్టాను అందుకున్నారు. ప్రమోద చంద్ర మిశ్ర విరచిత శతక కావ్యానం సాహిత్యకం అధ్యయనం అనే అంశంపై శ్రీకాంత్‌శర్మ పట్టా పొందారు. పీహెచ్‌డీ సాధించిన శ్రీకాంత్‌శర్మను పలువురు అభినందించారు.

అనంతవరం గ్రామంలో డీఎంఓ పరిశీలన



అనంతవరంలో పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ రత్నాకర్ వైద్యసిబ్బంది

అనంతవరం(క్రోసూరు): అనంతవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి డెంగీ జ్వరంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడన్న సమాచారం మేరకు శుక్రవారం పల్నాడు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రత్నాకర్ గ్రామాన్ని సందర్శించారు. వీధులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. డెంగీ జ్వర కారక దోమ మంచినీటిలో నివసిస్తుందని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఇంటిలో తాగునీటిని రోజూ మార్చుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రైడేగా పాటించాలని చెప్పారు. తాగిపడేసిన కొబ్బరిబొండాలు, పాత టైర్లు, పనికిరాని డబ్బాలు నిల్వ ఉంచుకోరాదని, కుండీలలో నీరు ఎక్కువగా ఉంటే దొర్లించాలని, వారానికి ఒకసారి నీరు నిల్వ ఉండే తొట్టెలు శుభ్రం చేసి ఆరబెట్టి, బ్లీచింగ్ వేసి ఎండబెట్టలాని కోరారు. నీటినిల్వలపై మూతలను పెట్టుకోవాలని చెప్పారు. దోమతెరలు వాడాలని వివరించారు. మురుగు కాలువల్లో దోమల నివారణ మందు చల్లించారు. ఆయన వెంట మలేరియా సబ్ యూనిట్ అధికారి బేగ్, పీహెచ్‌సీ సిబ్బంది ప్రభావతి, శివుడు, ఏఎన్ఎం డి.వి.పద్మావతి, ఆశ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఆదాయ మార్గాలపై దృష్టిపెట్టాలి

జెడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి



అచ్చంపేట: జిల్లాపరిషత్ ఆస్తులు అన్యాక్రాంతానికి గురికాకుండా రక్షణ కల్పించి, వాటి ద్వారా ఆదాయ వనరులు సమకూర్చాలని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి సూచించారు.

గుంటూరు జిల్లా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం జరిగిన 1వ స్థాయీ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్చంపేట మండలంలో కొత్తపల్లి, చిగురుపాడు, మాదిపాడు గ్రామాలలో జిల్లా పరిషత్‌కు 10ఎకరాలకుపైగా సేద్యపు భూములున్నాయని, వీటికి ఏటా బహిరంగ వేలం నిర్వహించాలన్నారు. అచ్చంపేట జిల్లా పరిషత్ అతిథిగృహం వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు, గోదాములు నిర్మించాలని సూచించారు.

యువకుడిని చితకబాదిన ఇద్దరిపై కేసు

సత్తెనపల్లి: యువకుడిని చితకబాదిన ఇద్దరిపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. నందివెలుగు గ్రామానికి చెందిన చదలవాడ హనుమంతరావు, యారగంటి వెంకటేశ్వర్లు, కొండమోడుకు చెందిన యారగంటి జయరామ్, మరికొందరు కోళ్ల ఫారాల్లో పని చేసేందుకు సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామానికి మూడు నెలల క్రితం వచ్చారు. యరగంటి జయరామ్ ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో పది రోజుల క్రితం హనుమంతరావు, వెంకటేశ్వర్లు హెచ్చరించారు. అయినా లెక్కచేయకుండా గురువారం మళ్లీ మహిళతో జయరామ్ అసభ్యంగా ప్రవర్తించడంతో హనుమంతరావు, వెంకటేశ్వర్లు రబ్బరు బెల్ట్‌తో చితకబాదారు. జయరామ్ వీపుపై ఎర్రగా వాతలు పడటంతో జయరామ్ సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చికిత్స నిమిత్తం వైద్యశాలలో చేరాడు. దీనిపై సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఈఓపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

అమరావతి: తమకు రావాల్సిన శిక్షణ తరగతుల నగదు మంజూరు చేయడం లేదని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఎంఈఓ శ్రీనివాసరావుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మండెపూడి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు డి.పెదబాబు ఆధ్వర్యంలో విద్యాశాఖ ఆర్జేడీ వి.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. పెదబాబు మాట్లాడుతూ అక్టోబర్‌లో జరిగిన టీఏఆర్ఎల్ శిక్షణలో భోజనం, ఫలహారాలకు సంబంధించి ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నగదును ఎంఈఓ డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు చెల్లించినట్లు ముందుగానే అక్విడెన్స్ తీసుకుని ఎటువంటి చెల్లింపులు చేయకుండా కాలయాపన చేస్తున్నారని వివరించారు. ఇటీవల డెప్యూటేషన్లు నిబంధనల మేరకు జరగలేదని ఫిర్యాదు చేశారు. ఎంఈఓపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

హైస్కూలుకు విద్యుత్ బెల్ బహూకరణ



హైస్కూలుకు విద్యుత్‌బెల్ బహూకరిస్తున్న దృశ్యం

అచ్చంపేట: పూర్వ ఉపాధ్యాయులు ముప్పాళ్ల గోపాలకృష్ణమూర్తి శతజయంతి సందర్భంగా ఆయన కుమారులు ముప్పాళ్ల సుబ్రమణ్యశర్మ, నరశింహమూర్తి, వెంకటేశ్వర్లు, శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విద్యుత్‌బెల్‌ను బహూకరించారు. దీనిని హెచ్‌ఎం వి.లక్ష్మీనారాయణకు అందచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన తండ్రి 35ఏళ్లు ఇదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. దాత తుమ్మెపల్లి శ్రీరాములకు ప్రేరణ కల్పించి పాఠశాల నిర్మాణానికి తన తండ్రి కృషిచేశారని చెప్పారు. పురాతనమైన పాఠశాల భవనాన్ని ఆయన పెన్షన్ డబ్బులు రూ.6 లక్షలతో మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. పాఠశాలలో గ్రంథాలయానికి అవరమయ్యే బీరువాలు, విజ్ఞాన, వినోదాత్మక, క్రీడా, ఆధ్యాత్మిక గ్రంథాలను ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఏరియా వైద్యశాల ల్యాబ్‌కు ఏసీ, చైర్ బహూకరణ



వైద్యశాలలోని ల్యాబ్‌కు ఏసీ, చైర్ అందిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల ల్యాబ్‌కు దాతల సహకారంతో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏసీ, చైర్‌ను బహూకరించారు. వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ల్యాబ్‌లో పని చేస్తున్న మహమ్మద్ అలీ, వారి స్నేహితులైన షేక్ హజర్బీ, పఠాన్ షంషద్ ఖాన్ సహకారంతో సుమారు రూ.50 వేలు విలువైన ఏసీ, చైర్ బహూకరించారని పేర్కొన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ వెంకట్రావు మాట్లాడుతూ వైద్యశాలలో పని చేస్తూ హాస్పిటల్ అభివృద్ధికి దోహదపడుతున్న అలీని అభినందించారు. హాస్పిటల్ మరో అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సయ్యద్ ఖాజా మాట్లాడుతూ ల్యాబ్‌కి ఈ ఏసీ ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌రెడ్డికి నివాళి



రాజశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : శ్రీనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఆళ్ల రాజశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నివాళులర్పించారు. రెండు రోజుల క్రితం రాజశేఖర్‌రెడ్డి కాణిపాకం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. రాజశేఖర్‌రెడ్డి మృతదేహం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే కాసు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. రాజశేఖర్‌రెడ్డి తల్లిదండ్రులు, భార్య, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్ రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం

ముప్పాళ్ళ: ముప్పాళ్లకు చెందిన వృద్ధుడి జాడ తెలియటం లేదంటూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య శుక్రవారం తెలిపారు. ముప్పాళ్ళకు చెందిన 80 ఏళ్ల గోళ్ళ మారిచిన పాపిరెడ్డి గత నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఆయన జాడ కానరాలేదు.